(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# బుచ్చిబాబుగారు ఇతరులకి వ్రాసిన ఉత్తరాలు

## *గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారికి*

హైదరాబాదు

11 ఏప్రిల్ 58

**శ్రీ వెంకట సుబ్బయ్యగారూ,**

క్రితం నెల 15వ తేదీనుండి వో పది రోజులపాటు మద్రాసులో ఉద్యోగరీత్యా ఉండటం జరిగింది. అప్పుడు కొంత సమయం మిత్రులు శ్రీ జానకీరాంతో గడిపాను. మిమ్మల్ని గురించి, చలంగార్ని గురించి మీరు తలపెట్టిన గ్రంథం గూర్చి ముచ్చటించుకున్నాము. మీ జాబు వారికెంతో తృప్తినీ, ఆనందాన్ని సమకూర్చింది. మీది, చలంగారిది కూడా చదివి వినిపించారు.

ఆత్మీయత, మనసిచ్చి మాట్లాడలేనిదే జానకిరాంకి జరగదు. మీరది కనబర్చడం వారికెంతో మానసిక బలాన్ని సమకూర్చింది. చలంగార్ని గూర్చి వారు వ్రాసిన వ్యాసం కూడా చదివి వినిపించారు. అది మీకు బాగా ఉపకరిస్తుంది. ఆ గ్రంథం మార్చి నాటికి పూర్తవుతుందని వీలైతే నన్ను కూడా నాలుగు ముక్కలు వ్రాసి పంపమన్నారు. గ్రంథం పూర్తికాక, యింకా ఒకటి రెండు అభిప్రాయాలు చేర్చడానికి అవకాశం ఉన్నట్లయితే తెలియబరచండి, వ్రాసి పంపుతాను.

చలంగార్ని గూర్చి వ్రాయడానికి ఎంతో ఉత్సాహంగాఉన్నా జంకుతాను. ఎందుకంటే, ఆయన రచనల్ని గూర్చి ఒక సమగ్రమైన పరిశీలన 15 సంవత్సరాల క్రితం తలపెట్టాను. దానికి యింతవరకూ పూనుకోలేదు. ఇంక చిన్న చిన్న అభిప్రాయాలు, ప్రశంసలు వ్రాయడం నాకిష్టంలేదు. చలంగారు చాలా దూరం వెళ్ళారు – అందరూ అనుకున్నదికాక మార్గం కొత్తదే. ఆయనకు మా బోంట్ల అభిప్రాయాలతో నిమిత్తంలేదు, అనుచరులకోసం వెనక్కి తిరిగిచూడరు. ఆయన తొక్కిన మార్గం వొకటుందనీ. దాంట్లో వెళ్ళడానికి కావలసిన లక్షణాలు ఏమిటో తెలియచెప్పడం జరిగితే కొంతమెరుగే.

వ్రాయండి.

మరి సెలవు.

**భవదీయుడు**

**బుచ్చిబాబు**

***

A.I.R
హైదరాబాదు 4

23-9-57

**శ్రీ వెంకటసుబ్బయ్యగారూ,**

నేను దాశరథిగారు మీ జాబు చదివి అది మీరు వ్రాసిందేనని తేల్చుకున్నాము. మీరు సంతకం చేయడం మరిచిపొయ్యారు.

మరి కొందరు కథకుల్ని గూర్చి వ్రాయసంకల్పించినందుకు సంతోషం. నేనంత ఎక్కువగా కథలు చదివేవాడనుకాను. కాని కొందరు పేర్లు మనకి తెలుస్తూనే ఉన్నాయి. పద్మరాజుగారు, కరుణకుమార్, బలివాడ కాంతారావు, పంతుల శ్రీరామశాస్త్రి, ఇల్లిందల సరస్వతీదేవి

భరద్వాజ, ధనికొండ హనుమంతరావు, అమరేంద్ర, వీరంతా పేరుపడ్డ వ్యక్తులే. వీరిలో ఎవర్ని తీసుకోవాలి అన్నది, విమర్శించేవారి దృక్పథం, వాడే కొలతబద్ద సూత్రాలమీద ప్రధానంగా వుంటుంది. సమకాలికుల విషయంలో విలువలు కట్టి స్థానాలు నిర్ణయించటం కష్టంకదా. శ్రీ వాత్సవగారు (యండమూరి సత్యనారాయణగారు) ఏటేటా సంవత్సరాది సంచికలలో రచనలు సింహావలోకనం చేస్తూవుంటారన్న సంగతి మీకు తెలిసే వుంటుంది. వారిప్పుడు విజయవాడ రేడియో నిలయంలో ఉంటున్నారు. వారు మీకు సరైన సూచనలివ్వగలరనుకుంటాను.

ఇంక నా కథల విషయం. 1939లో వ్రాయడం ప్రారంభించాను. మొదటి కథ 'మరతమన్న మరుపురారూ అన్నది' భారతిలో వచ్చింది. చాలా భాగం కథలు భారతి, ఆంధ్రవారపత్రిక, గృహలక్ష్మి (వెనకటి) ఆనందవాణి స్వతంత్ర, శిల్పిలో పడినవే. 1940లో నమ్మాళ్వార్స్ బుచ్చిబాబు కథలు ప్రచురించారు. నాకప్పుడు 23వ ఏడు. ఇప్పుడు నలభై. శివరామకృష్ణగారు  రెండు సంపుటాలు ప్రచురించారు. మీకు తెలిసినవే. వీటిల్లో ఒకటి నన్ను గురించి కథ వ్రాయవూ? అన్నదాన్ని బుక్ ట్రస్ట్ వారి Anthologyలో వచ్చింది. దేశం నాకిచ్చిన సందేశం అన్నది సాహిత్య అకాడమీ వారి Anthologyలో వేస్తున్నారు. మూడు కథలు ఆంగ్ల తర్జుమాలు త్రివేణి, Calcutta Journel of Andhra Association, Swatantra లో పడినవి. తరవాత శశికళవారు 'నిరంతరత్రయం' మీరు నేను మాఘం అనే రెండు కథలు వేశారు. వారం క్రితం "చైత్న్య స్రవంతి" ఆదర్శగ్రంథమాల, హైదరాబాదు వారు ప్రచురించారు

గద్దె లింగయ్యగారు (విజయవాడ) మూడు సంపుటాలు వేస్తున్నారు. అవి యీ నెలాఖరుకు బైటపడవచ్చు. వాటిల్లో కొత్తగా వేస్తున్న కథలివి. "అరకులోయలో కూలిన శిఖరం", "కాలచక్రం నిలిచింది." "ఆశాప్రియ", "ఆమెనీడ" "నౌసటన్ వ్రాసిన రాత", "చరిత్రకాగడా". "ముందు నడక – వెనకచూపు" యివ్వి. ఇంకా గ్రంథరూపంలో రావల్సినవి "తనను గురించిన నిజం" "అబద్దాలు", "ఆ వాడిన ఆకులు", "మధ్యవర్తి", "డబ్బు డబ్బు డబ్బు" "కొరడా", "సన్నగిలిన వెలుగు", "ఇమిటేషన్ కాంతం", "మరతుమన్న మరపురారు", "ముగింపు మీకు తెలుసు" అనేవి.

ఇక్కడ శ్రీ డి.రామలింగంగార్ని ఎరిగే ఉంటారు. వారు స్రవంతిలో నన్ను గురించి వొక వ్యాసం వ్రాసారు. 'నన్ను మార్చిన పుస్తకం' అని నేను వ్రాసిన వ్యాసాన్ని ఆధారంగా వారీ వ్యాసం వ్రాశారు. వారి వ్యాసం మీకు ఉపకరించవచ్చు. నాటికల విషయం మీ పనికవసరంలేదు గనక వాటి వివరాలు వ్రాయడం లేదు.

అచ్చుపడిన తర్వాత వొక కాపీ పంపుతారు కదూ.

**భవదీయుడు**

**బుచ్చిబాబు**

Post your comments